# ఈ వారం కథ

# పాతివ్రత్యం

—ఇందిర

అమరపురి—

దివ్యకాంతులతో, మేలిమి జాలతారు పరదాల నడుమ, వొక శుభోదయాన సీత, సావిత్రి, సుమతి, తార, మండోదరి, ద్రౌపది, అహల్య మొదలుగా గల స్త్రీమూర్తులు కొలువు తీరారు.

ఆ కూటమిలో ప్రాచీన వేదకాల విద్వన్ మణులు, శాస్త్ర విద్యాపారంగతులు గార్గి, మైత్రేయి మున్నగువారు అగ్రపీఠాన్నలంకరించారు.

ఆనాటి సమావేశానికి ప్రధానకారణం పాండవ పత్ని ద్రౌపది మనసులో వుదయించిన యొకానొక ప్రశ్నే. వేద స్మృతి పురాణ యితిహాస కాలాలలోని సపత్నులు, పతివ్రతలు, తపసులు, విజ్ఞాన విశారదలు, అందరూ వచ్చిన తరువాత ద్రౌపదిని ప్రశ్నించమని కోరింది గార్గి. అమ్మా! పౌరాణికులు తార, మండోదరి, ద్రౌపది, అహల్యలను పతివ్రతలుగా కొనియాడారు. యితిహాసికులు సీత, సావిత్రి, సుమతి, అనసూయ, అరుంధతిలను పతివ్రతలుగా గుర్తించారు. అయితే మా అందరిలో ఎవరు వున్నత స్థానాన్ని పొందేఅర్హులు? ఎవరి పాతివ్రత్యం శక్తివంతమైనది? మాలో ఎవరు మహాపతివ్రత అని ప్రశ్నించింది ద్రౌపది.

ప్రశ్న సభికులలో కల్లోలాన్ని రేపింది. ఎవరికి తోచిన రీతిలోవారు మాట్లాడుకుంటున్నప్పటికీ అందరి దృష్టి ఆదిమకాల స్త్రీమూర్తులు గార్గి, మైత్రేయల సమాధానం మీదనే కేంద్రీకృతమయింది. అగ్రపీఠాన్నలంకరించిన వారు సుదీర్ఘసమాలోచన అనంతరము యిలా అన్నారు.

'సతీ సావిత్రిని మహాపతివ్రత అనడం సబబుగా వుంది. ఏలన మరణించిన భర్తకు ప్రాణం పోయడం ఒక విధంగా ప్రతిసృష్టే. అంతటి శక్తివంతురాలయిన ఆమే మహాపతివ్రత' అన్నది మైత్రేయి.

అంతలో సతీఅనసూయ, 'అమ్మా! అది ఆమె సంకల్పబలానికి దీక్షాదక్షతలకు నిదర్శనము. సంకల్పానికి అసాధ్యం ఏముంది. ఆత్మశక్తితో భగవత్సాక్షాత్కారాన్ని, అనుగ్రహాన్ని పొందిన వారెందరు లేరు.

ప్రేమాస్పదుడు, సుందరాకారుడయిన భర్త మరణము దుర్భరమైనది. అట్టి భర్తలేని ఆమె జీవించి మరణించడంతో సమానం కదా! కోల్పోయిన తన సుఖం, ఆనందం కోసమే సావిత్రి యమధర్మరాజు వెనుక యాత్రకై సిద్ధమయింది. అంతే

కాని, అది ఆమె పాతివ్రత్యాన్ని నిరూపించ గలిగిన పరీక్షాసమయం కాదు' అన్నది.

కొలువుతీరిన అందరూ, 'అవును నిజమే' నంటూ సతీఅనసూయ వాదనకు వత్తాసు పలికారు. మరికొంత తర్జన భర్జన అనంతరం గార్గి యిలా అన్నది.

'జననీ, సీతామాత అందుకు అర్హురాలని భావిస్తున్నాను.

శ్రీరాముని వనవాసం ఖాయమయినపుడు రామపత్నిగా రాజ్యభారాన్ని చేపట్టమని, రాణియై అయోధ్యను పాలించమని రాజర్షి వశిష్టుడు వత్తిడి చేసినప్పటికీ, ఆ అపూర్వ అవకాశాన్ని కాదని, రాజభోగాలను త్యజించి, అడవికే రాముని అనుసరించింది.

రావణుడు చెరబట్టినప్పుడు, ఆ నిర్బంధంలో రాముని జాడ తెలియని సంకటస్థితిలో కూడ ఆమె ఆత్మస్థిరచిత్తంతో రామవశమై వెలుగొందింది. సర్వకాల సర్వావస్థలలోనూ, ఆమె తన భర్త మాటనే అనుసరించి కడతేరింది. కాదంటారా?

అది విన్న వాలిభార్య తార—

అమ్మా! శ్రీరాముని మించిన తేజోవంతుడు, రూపవంతుడు, గుణవంతుడు, పరాక్రమశాలి, ప్రేమ స్వరూపుడు, కరుణాసముద్రుడు, ఆశ్రిత రక్షకుడు అయిన మహాపురుషులెవరున్నారు. అంతటి మహావీరుని పెండ్లాడిన సీతధన్యురాలు. అతని సన్నిధిలో సుఖసంతోషాలను అనుభవించినవారు, కలలో అయినా వేరొకరిని అంగీకరించగలరా?

అనుకూలుడయిన భర్త దగ్గర లేకుండా స్త్రీకి రాజ్యాలు భోగభాగ్యాలు సుఖాన్నివ్వగలవా?





పదునాల్గు వత్సరాల అరణ్యవాసం, సీతకు నిరంతరం భర్తసన్నిధిని అనుభవించగల అవకాశాన్ని యిచ్చింది. అట్టి అవకాశం రాచకార్యాలలో మునిగిన భర్త ద్వారా అసాధ్యంకాదా?

వనవాస చివరిదశలో రావణుని చెరలో వున్న సీతకు తన భర్త పరాక్రమాన్ని, బుద్ధి కుశలతను గురించి స్థిరమైన నమ్మకం వుంది. తనకా దుస్థితి ఎంతోకాలం కొనసాగదని ఆమెకు నిశ్చయంగా తెలుసు. అట్టి ఆమె నమ్మకం క్షీణించిన దశలో హనుమంతుని సందేశం ఆమెను రక్షించింది. ఆ విధంగా ఆమె స్థితిలోని ఏ పత్ని అయినా వదుచుకోదగిన అత్యంత సహజమైన పరిస్థితి అన్నది.

'సీత పతివ్రతే కాని మహాపతివ్రత కాజాలద'ని అందరూ తీర్మానించారు. చివరగా పాండుపత్ని, ద్రౌపదిని మహాపతివ్రతగా ప్రతిపాదించారు. ఒక వ్యక్తిని భర్తగా పొంది, అతని ఆత్మలో లీనమై అతనిపట్ల భక్తి ప్రపత్తులను కలిగి వుండడము, అతనినే సర్వకాల సర్వావస్థలలోను ధ్యానించడము సులభసాధ్యమే. కాని ఏకకాలంలో అయిదుగురి పట్ల సమానమైన ప్రేమానురాగాలను, భక్తిని కలిగి వుండడము, ప్రతిఒక్కని సన్నిధిలోను, వారే తన భర్తగా ఎంచి తాదాత్మ్యతను అనుభవించడం కష్టసాధ్యం.

అయిదు వేర్వేరు ఆత్మిక ప్రపంచాలు, అనుభూతులుకల పురుషులను సమానంగా అంగీకరించడం ఒక్క ద్రౌపదికే సాధ్యమయింది. కావన ఆమెను మహాపతివ్రతగా అంగీకరించవచ్చును కదా! అన్నారు.

అందుకు రావణపత్ని మండోదరి యిలా అన్నది.

'అమ్మా!, శివుని భార్యకు ఛాయామాత్రనయిన నేను రావణపత్నిగా నా ధర్మాన్ని నిర్వర్తించాను. వేర్వేరు. వైజాలుగల యిరువురి పట్ల, ఏకకాలంలో సమానభక్తిని కలిగి వుండడము కేవలం పరిశుద్ధ మనస్కులకే సాధ్యమని నేనెరుగుదును. అయితే తల్లీ! ద్రౌపది అయిదుగురి పట్ల తన ధర్మాన్ని నిర్వర్తించి నప్పటికి అది ఒకరి పట్ల నిబద్ధతే నని నా భావన. పంచపాండవుల శరీరాలు వేరయినా, ఆత్మ ఒక్కటే. భీమార్జుననకుల సహదేవులు నిరంతరం ధర్మజుని ఆజ్ఞకు, అతని అభీష్టానికి, ధర్మానికి నిబద్ధులు.

ధర్మజుని పట్ల నిబద్ధత, మిగిలిన నలుగురి పట్ల నిబద్ధతే కదా! ద్రౌపది అయిదుగురికి భార్య అయినా ఒకే ఆత్మకు బద్ధురాలు అన్న విషయం గుర్తించాలి' అన్నది.

'మహాపతివ్రతగా ఏకగ్రీవ అంగీకారం ఎవరికి లభిస్తుంది. సభలో ఎవరయినా ప్రతిపాదించండి' అని ప్రకటించారు. అందరూ ఎవరి ఆలోచనలో వారు మునిగి వుండగా, పరిసరాలు ప్రశాంత నిశ్శబ్దంలోనికి వొదిగి పోయాయి. దూరాన ఎక్కడో నారాయణ మంత్రజపం శ్రావ్యంగా వినిపించింది. 'ఆ నారాయణగానం నారదుల వారిది కాదు కదా' అన్నది అహల్య. 'అనుమానం ఎందుకు? తుంబురు నాదాన్ని గుర్తించ లేదా? అన్నది మండోదరి.

'నారదుల వారు వస్తున్నారు. వారిని మన సభకు ఆహ్వానించండి. మన ప్రశ్నకు సమాధానం చెప్పగల వివేక వంతులు ఆయనే' అన్నది మైత్రేయి.

నారదమహర్షి సపత్నుల కొలువు ప్రవేశించారు.

'త్రికాలజ్ఞులు, త్రిలోక సంచారులు అయిన నారద మునీంద్రా! ఆదిమ యుగం నుండి, నేటి వరకు, పతివ్రతలుగా ఖ్యాతి గాంచిన సతులలో మహాపతివ్రత అనదగిన సతిఎవరో శలవీయండి అని అందరూ వేడుకున్నారు. 'తల్లులారా? ఏ సత్యాన్వేషణకై ఈ ప్రశ్న మీమదిలో వుదయించినదో కాని నా సమాధానం మిమ్ము నొప్పించదుకదా' అన్నాడు నారదుడు చిద్విలాసంగా.

'మునీంద్రా! మాప్రశ్న కేవలం అనుమాన నివృత్తికే గాని, ఏ వొక్కరి ఆధిక్యత కోసమూకాదు. కావన తమరు నిస్సంకోచంగా మీ అభిప్రాయాన్ని శలవీయండి అన్నారు. ముక్త కంఠంతో.

'అట్లయిన వినండి తల్లులారా పతివ్రతా శిరోమణులుగా వినుతికెక్కిన సపత్నులారా

మీరంతా మీమీ యుగధర్మాన్ని అనుసరించి, మీ పతిపత్నుల అనుబంధాన్ని, వారి మధ్య యుండగల సర్వశ్రద్ధా భక్తులను మనసా, వాచా, కర్మణ ఆచరించి తరించారు. మీ భర్తలు కూడా మీ పట్ల వారి ధర్మాన్ని నియమానుసారం పాటించి మీ వలెనే వారునూ ప్రసిద్ధిగాంచారు. అట్టి భర్తలను పొందిన మీరు మిమ్ములను భార్యలుగా పొందినవారు ఎన్నడు తమ అంతరంగాలలో అసంతృప్తిని చవి చూడలేదు. అయితే తల్లీ! ఈ కలి యుగంలో, భూలోకంలో మీరు గుర్తించదగిన పతివ్రతామ తల్లులు లెక్కకు మిక్కిలిగావున్నారు. వారు, తమ భర్తలు తమను శారీరకంగా హింసించినా, మనసులను గాయపరచినా, స్వల్పప్రలోభాలకు లోబడి డబ్బుకై భార్యలను చంపడానికి కూడా వెనుకాడని దుర్బలురైనా, వారుతమ పతిని ఎడబాయక వారినీడనే జీవనం కొనసాగిస్తున్నారు. అనేక హింసలను భరిస్తూ, భర్తగా అతడు తన ధర్మాన్ని నిర్వర్తించకపోయినా, సహనంతో యిరువురి బాధ్యతలను తామే మోయడానికి సంసిద్ధులై ప్రయాస పడుతున్నారు. అంతటి సహన మూర్తులు, శీలవతులను మహాపతివ్రతలుగా కొనియాడవచ్చుకదా! అన్నాడు నారదుడు.

'మునీంద్రా భూలోకంలో పురుషులు తమ బాధ్యతలను విస్మరించి స్త్రీల పట్ల రాక్షసంగా ప్రవర్తించడం శోచనీయం. కాని భర్త ఎటువంటి వాడయినా, అతని తోడిదే భార్య జీవితము కదా? పతిని ఎడబాయుట ఎన్నటికీ సమంజసం కాదు. భూలోక పత్నులు కష్టమయినా వారి ధర్మాన్ని వారు అనుసరిస్తున్నారు' అన్నది సతీసుమతి.

అందుకు నారదుడు—

'అది నీయుగ ధర్మం తల్లీ. భూలోకవాసులకు కలియుగం బోధించిన ధర్మం, స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వం. మానవ హక్కుల పరిరక్షణే వారి ప్రధాన కర్తవ్యము. స్త్రీఅయినా, పురుషుడయినా, బాలురయినా, వృద్ధులయినా, పరస్పర వునికిని, వ్యక్తిత్వాలను గుర్తించి గౌరవించడం, ఒకరిపై మరొకరి దౌర్జన్యాలను ఎదుర్కొనడమే వారి ధర్మశాస్త్రాలలో వుటంకించబడింది. దుష్టుడయిన భర్త నుంచి విడివడడమే భూలోక సతులకు బోధించే జ్ఞానము. అయినప్పటికీ వారి యుగధర్మాన్ని విస్మరించి భర్తలనే దైవాలుగా భావించే ఆ స్త్రీమూర్తులు మహాపతివ్రతలు కాదా?' అన్నాడు.

'అయితే ఐచ్ఛికంగా భర్త నుండి విడిపోడానికి భూలోకం అనుమతించిందా? పరమాశ్చర్యము. నేనెన్నడు అట్టిస్థితిని వూహించనయినా లేదు మహర్షీ.' అట్టి అవకాశం వుండి దుష్టుడయిన భర్తను అంగీకరించడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఏమయినా వారిని మహాపతివ్రతలుగా గుర్తించక తప్పదు' అని సతీసుమతి అంగీకరించింది.

'మహర్షీ! అట్టి పతివ్రతా శిరోమణులు మన స్వర్గధామమందు కనిపించలేదెందుకని? ప్రశ్నించింది. గార్గి.

తల్లీ! ఏమని చెప్పను. కృత, త్రేతా, ద్వాపరయుగ ధర్మం ప్రమాణంగా తీసుకుంటే భూలోకపత్నులు పతివ్రతలే. కాని వారివారి యుగధర్మాన్ని నియమం తప్పక అనుసరించిన వారికే స్వర్గ ప్రవేశం సాధ్యమని సకల విద్యా పారంగతురాలివి, నీకు వేరు చెప్పాలా' అన్నాడు చిరునవ్వుతో.

'మునీంద్రా! పతివ్రతలుగా కొనియాడబడినప్పటికీ భూలోక సతులకు నరకమే సంప్రాప్తించడం, ఏమిటీ అన్యాయం? అని ఆవేదన వ్యక్తం చేసింది' సీత.

'వారి లోకంలో వారు పతివ్రతలుగా గుర్తించబడలేదు సీతమ్మా. నేను ముందే చెప్పానుకదా! వారు మీ యుగాల ధర్మాలనే యింకా అనుసరిస్తున్నారని' అన్నాడు నారదుడు వర్మగర్భంగా.